క్లుప్తంగా

సమస్య పరిష్కారానికి చర్యలు


మురుగునీటి తూర ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

మామిడికుదురు: నగరం రజకుల చెరువు వద్ద మురుగు నీటి తూర పాడైపోవడంతో సుమారు 50 ఎకరాల్లో పంట ముంపు బారిన పడింది. దీంతో పాటు నారుమడులు మునిగిపోయాయి. ఈ సమస్యపై రైతులు ధర్నా చేయడంతో నగరం గ్రామ పంచాయతీ అధికారులు స్పందించారు. రోడ్డు మధ్యలో దెబ్బతిన్న తూరను జేసీబీ సహాయంతో బుధవారం తొలగించి దాని స్థానే కొత్త తూరను ఏర్పాటు చేశారు. సర్పంచ్ జాలెం రమణకుమారి, పంచాయతీ కార్యదర్శి పీవీఎస్‌వీ ప్రసాద్ నేతృత్వంలో రైతుల సమస్యను పరిష్కరించారు. దీనిపై రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

ఇంటి ప్రహరీ ధ్వంసం


ఇరుసుమండలో ధ్వంసమైన ఇంటి ప్రహరీ

అంబాజీపేట: ఇరుసుమండలో బుధవారం తెల్లవారు జామున లారీ ఢీకొని ఆకుల రాంబాబుకు చెందిన ఇంటి ప్రహరీ ధ్వంసమైంది. భవనం పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో స్తంభంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్, వైర్లు చెల్లాచెదురయ్యాయి. ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఈ ఇంటిని లారీ ఢీకొట్టి ఆపకుండా వెళ్లిపోవడంతో ఆ ఇంటి యజమాని రాంబాబు వెంబడించారు. అయితే ఆ లారీ ఆచూకీ తెలియలేదు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

నేడు ఎస్‌ఎంసీ ఎన్నికలకు నోటిఫికేషన్

అంబాజీపేట: పాఠశాల యాజమాన్య కమిటీల (ఎస్‌ఎంసీ) ఎన్నికలకు ఆగస్టు 1న నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ఎంఈఓ-1, 2లు కాండ్రేగుల వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్ తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర సమగ్ర శిక్ష, ఎస్పీడీ బి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారన్నారు. నోటిఫికేషన్‌తో పాటు ఓటర్ల జాబితాను ప్రకటిస్తామన్నారు. 5న అభ్యంతరాలు స్వీకరించి తుది జాబితాను ప్రకటిస్తామని, 8న ఎన్నికల నిర్వహణ ఉంటుందన్నారు. మరింత సమాచారం కోసం పాఠశాలల హెచ్‌ఎంలను సంప్రదించాలన్నారు.

వనువులమ్మకు సారె సమర్పణ


అమ్మవారికి సారె తీసుకు వచ్చిన శ్రీవాసవీ సంఘ సభ్యులు

రాజోలు: రాజోలు గ్రామ దేవత వనువులమ్మ వారికి ఆషాఢ ఏకాదశి సారెను బుధవారం సమర్పించారు. స్థానిక శ్రీవాసవీ కోలాట భజన సంఘం ప్రతినిధి కోదాటి దుర్గ ఆధ్వర్యంలో అమ్మవారికి చీరలు, జాకెట్, గాజులు, పసుపు, కుంకుమ, వివిధ రకాల పిండి వంటలతో సారెను అందజేశారు. ఆలయంలో విష్ణు సహస్రనామాలు, లక్ష్మీ అష్టోత్తరం ఆలపిస్తూ భజన కోలాటం నిర్వహించారు.

యానిమేటర్ తొలగింపునకు తీర్మానం


ఆలమూరులో డ్వాక్రా సంఘ సమావేశాన్ని నిర్వహిస్తున్న ఏపీఎం ధనరాజు

ఆలమూరు: స్థానిక వెలుగు డ్వాక్రా యానిమేటర్‌గా పనిచేస్తున్న బి.శిరోమణిని విధుల నుంచి తొలగించాలంటూ బుధవారం గ్రామ సంఘం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఆలమూరు-1 పరిధిలో ఉన్నతి, స్త్రీ నిధి నిధులు దుర్వినియోగం అయ్యాయంటూ స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పలుమార్లు జిల్లా ఉన్నతాధికారులు గ్రామానికి వచ్చి విచారణ జరిపారు. ఈ విచారణలో రూ 3.75 లక్షల నిధులు దుర్వినియోగం అయ్యినట్లు నిర్ధారణ కావడంతో ఉన్నతాధికారులు స్పందించారు. జిల్లా డ్వాక్రా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు మండల శాఖ ఏపీఎం ఎం.ధనరాజు ఆధ్వర్యంలో అధికారుల బృందం గ్రామ సంఘం సమావేశాన్ని నిర్వహించింది. అందులో నిధులు దుర్వినియోగం ఆరోపణలు ఎదుర్కొంటున్న యానిమేటర్‌ను విధుల నుంచి తొలగించాలని తీర్మానించింది. ఈ మేరకు యానిమేటర్‌ను విధుల నుంచి తొలగించనున్నట్లు ఏపీఎం ధనరాజు తెలిపారు.


అప్పనపల్లి కాజ్‌వేపై ప్రవహిస్తున్న నీరు


కె.ఏనుగుపల్లిలో వరద ఉధృతికి కోతకు గురైన రోడ్డు మార్జిన్


సఖినేటిపల్లి లాకుపేటలో ఆహార ప్యాకెట్లు అందజేస్తున్న సిబ్బంది

కాస్త నెమ్మదించిన నది

- తగ్గుతున్న గోదావరి వరద
- లంక గ్రామాల్లో ఇంకా ముంపు

మామిడికుదురు: ఊరూ వాడా.. పంట పొలాలు.. లంకలతో పాటు రోడ్లనూ ముంచెత్తిన వరద కాస్త నెమ్మదించింది. వరద తగ్గినా పూర్తి స్థాయిలో గ్రామాలు తేరుకోలేదు. పాశర్లపూడి ఏటిగట్టు దిగువన అప్పనపల్లి కాజ్‌వేపై ముంపునీరు ఇంకా ఉంది. ఈ కాజ్‌వేపై బుధవారం మూడడుగుల మేర వరద నీరు ప్రవహిస్తోంది. ఈ మార్గంలో రాకపోకల పునరుద్ధరణ జరగలేదు. దీంతో మామిడికుదురు శివారు కొర్లగుంట ఏటిగట్టు దిగువన ఉన్న మార్గంలో అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెదపట్నం, పాశర్లపూడిబాడవ, పాశర్లపూడిలంక మత్స్యకార ప్రాంతాలు వరద నుంచి పూర్తిగా బయట పడ్డాయి. వరద బాధితులకు బియ్యంతో పాటు నిత్యావసరాల పంపిణీ జరుగుతోంది.

పి.గన్నవరం: వశిష్ట, వైనతేయ నదీపాయల్లో వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది. పది రోజులుగా జల దిగ్బంధంలో ఉన్న లంక గ్రామాలు కాస్త తేరుకుంటున్నాయి. అయితే ఊడిమూడిలంక, జి.పెదపూడి లంక, బూరుగులంక, అరిగెలవారిలంక గ్రామాల ప్రజలు పడవలపైనే ప్రయాణిస్తున్నారు. లంక భూముల్లోని వాణిజ్య పంటలు వరదనీట మునిగి పాడైపోయాయి. దీంతో నష్టాల బారిన పడ్డామని రైతులు వాపోతున్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని లంక గ్రామాల ప్రజలు కోరుతున్నారు. మండలంలోని కె.ఏనుగుపల్లి, వై.కొత్తపల్లి గ్రామాల్లో వరద బాధితులకు బియ్యం, నిత్యావసర సరకులను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పంపిణీ చేశారు.

అయినవిల్లి: ముక్తేశ్వరం వృద్ధ గౌతమిపాయలో వరద నీరు ప్రవహిస్తోంది. ముక్తేశ్వరం- అయినవిల్లిలంక ఎదురుబిడెం కాజ్‌వేపై నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టింది. లంక ప్రజల రాకపోకలు కొనసాగుతున్నాయి. ఇళ్లలోకి, రహదారుల పైకి వరదనీరు చేరడంతో గ్రామస్తులకు రోగాల భయం పట్టుకుంది. వైద్య సేవలందించాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని, ముంపు నీటిని మళ్లించేందుకు కచ్చా డ్రైన్లు తవ్వించాలని అంటున్నారు. ఇలా ఉండగా వరదతో కూరగాయలు, అరటి, కోకో, బొప్పాయి వంటి పంటలు పూర్తి కుళ్లిపోయాయి. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతన్నలు విజ్ఞప్తి చేస్తున్నారు. అయినవిల్లిలంక, వీరవల్లిపాలెం, పొట్టిలంక, కొండుకుదురులంక, తొత్తరమూడిలోని కె.పెదలంక, చింతనలంక, మడుపల్లిలంకలోని పల్లపు ప్రాంతాల్లో ముంపు నీరు ఇంకా తగ్గలేదు.

తగ్గుతున్న ఉధృతి

సఖినేటిపల్లి: అప్పనరామునిలంకలో బుధవారం ప్రధాన రహదారులు వరద ముంపు నుంచి బయట పడ్డాయి. లోతట్టు ప్రాంతాల్లో ఇళ్ల వద్ద, కొబ్బరి తోటల్లో ఇంకా నీరు ప్రవహిస్తోంది. గోదావరి పాయను ఆనుకుని ఉన్న సఖినేటిపల్లి లాకుపేటలో వరద నీటిమట్టం తగ్గినా ఇళ్ల వద్దకు పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. గోదావరి పాయ వెంబడి ఉన్న ఇళ్లు, అంగన్‌వాడీ సెంటర్ ఇంకా నీటిలోనే ఉన్నాయి. పడవలపై ఇంటింటికీ ఆహార పొట్లాలను, తాగునీటిని వీఆర్వో శ్రీనివాస్‌రావు, ఎన్ఆర్ఈజీఎస్ జేఈ శ్రీనివాసరావు పంపిణీ చేశారు. గోదావరి పాయను ఆనుకుని ఉన్న టేకిశెట్టిపాలెం అగ్నికుల క్షత్రియ కాలనీ వద్ద ఇంకా నీరు ఉంది. అప్పనరామునిలంకలో పంచాయతీ వద్ద ప్రధాన రోడ్డుపై మోటార్‌సైకిల్‌ను తీస్తుండగా మోకా అయ్యప్పను పాము కాటు వేసింది. వెంటనే మొబైల్ వైద్య సిబ్బంది స్పందించి అయ్యప్పకు ప్రాథమిక చికిత్స అనంతరం రాజోలులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.


పి.గన్నవరం మండలం కె.ఏనుగుపల్లిలో దెబ్బతిన్న తాటాకిల్లు


సఖినేటిపల్లి లాకుపేటలో వరద నీటిలో అంగన్‌వాడీ కేంద్రం


పాముకాటుకు గురైన అయ్యప్పను రాజోలు ఆసుపత్రికి తరలిస్తున్న వైద్య సిబ్బంది

ఏఎస్‌వీ ఇంజెక్షన్లు అందుబాటులో ఉంచాలి

మామిడికుదురు: గోదావరి తీర గ్రామాల్లో పాముల బెడద తీవ్రంగా ఉన్న నేపథ్యంలో యాంటీ స్నేక్ వీనమ్ ఇంజెక్షన్లు (ఏఎస్‌వీ) అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్‌ఓ దుర్గారావు దొర సూచించారు. బుధవారం లూటుకుర్రు పీహెచ్‌సీని ఆయన సందర్శించారు. పీహెచ్‌సీలో రికార్డులను తనిఖీ చేశారు. ఏఎస్‌వీ వివరాలు తెలుసుకున్నారు. గోదావరి వరద ప్రభావిత గ్రామాల్లో ప్రజలకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. లక్ష్యానికి అనుగుణంగా ఉద్యోగులు పని చేయాలని సూచించారు. గర్భిణుల వివరాలను విధిగా నమోదు చేయాలన్నారు. వారికి మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. వరద ప్రభావిత గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని, డయేరియా వంటి అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ సూచించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి రమ్యశైలజ, సిబ్బంది పాల్గొన్నారు.


లూటుకుర్రు పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ దుర్గారావు దొర

మేలైన వరి పంటకు ధ్రువీకరణ

అంబాజీపేట: తక్కువ మొత్తంలో ఎరువులు, పురుగు మందులు వాడిన వరి పంటకు ధ్రువీకరణ పత్రం ఇవ్వడంతో పాటు మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయించుకునేలా చర్యలు తీసుకుంటామని జిల్లా వనరుల కేంద్ర ఏడీఏ ఏవీఎస్ రాజశేఖర్ రైతులకు వివరించారు. ఇరుసుమండలో పొలంబడి కార్యక్రమాన్ని ఏఓ సీహెచ్‌డీ విజయ్‌కుమార్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఏడీఏ రాజశేఖర్ మాట్లాడుతూ మేలైన వ్యవసాయ పద్ధతుల ద్వారా పండించిన పంటలను పొలంబడిలో ధ్రువీకరిస్తామన్నారు. పి.గన్నవరం ఏడీఏ ఎస్‌జేవీ రామమోహనరావు మాట్లాడుతూ సమగ్ర సస్యరక్షణ, ఎరువుల యాజమాన్యం ద్వారా పంటల దిగుబడి సాధించవచ్చన్నారు. అనంతరం వరిలో విత్తనశుద్ధి, పురుగు మందులతో విష ప్రభావంపై రైతులకు బ్యాలెట్ బాక్స్ టెస్ట్ నిర్వహించారు. అలాగే కలుపు మందు, నీటి యాజమాన్యం, సేంద్రియ పద్ధతులతో జీవామృతం తయారీని వివరించారు. ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది జె.నాగవేణి, ఏఈఓ డి.దుర్గారావు పాల్గొన్నారు.


ఇరుసుమండలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ రాజశేఖర్

సమాజ సేవలతో తరించాలి

కొత్తపేట: భగవాన్ పుట్టపర్తి సత్యసాయిబాబా స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ సమాజ సేవలతో తరించాలని సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు అన్నారు. స్థానిక సత్యసాయిబాబా నిలయంలో బుధవారం శ్రీరామా నర్సింగ్ హోమ్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

మహిళల స్వయం ఉపాధికి ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కంకటాల సత్యనారాయణ (కేఎస్ఎన్), సభ్యుల ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని, కుట్టు శిక్షణ కేంద్రాన్ని లక్ష్మణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా కేఎస్ఎన్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు విస్తృతం చేయడంలో భాగంగా పేద, మధ్య తరగతి మహిళల జీవనోపాధికి కుట్టు శిక్షణ కేంద్రాన్ని పునః ప్రారంభించామన్నారు.

లక్ష్మణరావు మాట్లాడుతూ కొత్తపేట సేవా సమితి ద్వారా రోజూ ఎందరో అభాగ్యులకు భోజనం అందించడం, ప్రతి గురువారం వివిధ సేవలు చేయడం అభినందనీయమన్నారు. ప్రముఖ వైద్యుడు సత్యవరపు గాంధీ సుమారు 50 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. జిల్లా సంస్థల అధ్యక్షుడు ఎ.కొండబాబు, సభ్యుడు వివేకానందరెడ్డి, రావులపాలెం సేవా సమితి అధ్యక్షుడు మన్యం వర్ధనరావు, స్థానిక సమితి సభ్యులు శ్రీఘాకోళ్లపు భాస్కరరావు, రంగనాయకులు పాల్గొన్నారు.


కొత్తపేటలో కుట్టు శిక్షణ ప్రారంభించిన రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు తదితరులు

వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి



కొత్తపేటలో ర్యాలీ చేస్తున్న ప్రిన్సిపాల్ పెద్దిరాజు, న్యాయవాదులు, అధ్యాపకులు, విద్యార్థులు

కొత్తపేట: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పెద్దిరాజు సూచించారు. స్థానిక డిగ్రీ కళాశాలలో డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ ధారణపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ పీఓ డీసీహెచ్ పాపారావు, బార్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు ప్రిన్సిపాల్ డాక్టర్ పెద్దిరాజు అధ్యక్షత వహించగా సీనియర్ న్యాయవాదులు ఏటీ ప్రభాకరరావు, కె.బాలప్రతాప్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెల్మెట్ ధరించి డ్రైవింగ్ చేయడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలని, వాహనాలకు తప్పనిసరిగా బీమా చేయించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు స్టాఫ్ మెంబర్లు ఎం.సూర్య, ఎస్.భవాని, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు దాణా పంపిణీ

అయినవిల్లి: గోదావరి వరద ముంపునకు గురైన గ్రామాల్లో కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్ బుధవారం పశువుల దాణా పంపిణీ చేశారు. అయినవిల్లి మండలం పొట్టిలంక గ్రామంలో ఒక్కో పాడి రైతుకు 25 కిలోల చొప్పున ఆయన అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. వరద ప్రభావంతో పశుగ్రాసం కొరత రాకుండా ప్రభుత్వం టోటల్ మిక్సర్ రేషన్ (దాణా)ను సరఫరా చేస్తుందన్నారు. మండలంలోని పశువుల కోసం 32 టన్నుల దాణాను పశుసంవర్ధక శాఖ ద్వారా ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వెంకట్రావు, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పథక సంచాలకుడు వి.శివశంకర్ ప్రసాద్, మాగాం పశు వైద్యుడు రేవంత్ తదితరులు పాల్గొన్నారు.


పశువుల దాణాను పంపిణీ చేస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

పి.గన్నవరం: ఊడిమూడి సొసైటీ కార్యాలయం వద్ద పాడి రైతులకు పశువుల దాణా పంపిణీ చేశారు. సర్పంచ్ నూకపెయ్యి ప్రసన్న కుమార్, ఎంపీటీసీలు ఆదిమూలం సూరయ్యకాపు, అయినపర్తి ఇందిరా ప్రియదర్శిని, పశు సంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన

మలికిపురం: స్థానిక విజయ హాస్పిటల్ వద్ద పిల్లలకు పౌష్టికాహారం, తల్లిపాల ఆవశ్యకతపై మలికిపురం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్లు ఓగూరి అలేఖ్య, రాపాక రమేష్‌బాబు మాట్లాడుతూ బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే తల్లి పాలు ఎంతో ముఖ్యమన్నారు. అనంతరం పిల్లలకు హార్లిక్స్ ప్యాకెట్లు, పండ్లు, పాలు పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు బత్తుల ఝాన్సీబాయ్, కార్యదర్శి మట్టా రవికుమార్, కోశాధికారి తోలేటి సతీష్, రొటేరియన్లు సోమిశెట్టి మురళీకృష్ణ, రాపాక విజయారావు, ఫాస్ట్ అసిస్టెంట్ గవర్నర్ నల్లి శివకుమార్ పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ఆలమూరు: సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో మండలంలోని వివిధ గ్రామాల్లో పారిశుధ్య పనులను ముమ్మరం చేశారు. జిల్లా వైద్యారోగ్య, పంచాయతీరాజ్ శాఖ ఆదేశాల మేరకు గ్రామాల్లో సర్పంచులు, కార్యదర్శుల ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు చెత్తా చెదారాన్ని తొలగించారు. డ్రైనేజీలను శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లారు. అలాగే వాటర్ ట్యాంకులను శుభ్రం చేశారు. పారిశుధ్య పనులు క్రమం తప్పకుండా నిర్వహించేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేశామని ఎంపీడీఓ మేరీరోజ్ తెలిపారు.

జూనియర్ కళాశాల అభివృద్ధికి కృషి


ఆలమూరులో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందజేస్తున్న ఆర్జేడీ శారద

ఆలమూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానని ఇంటర్మీడియేట్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఐ.శారద అన్నారు. స్థానిక జూనియర్ కళాశాలను బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలో సమస్యలు, విద్యార్థుల అభ్యున్నతికి తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఖాళీగా ఉన్న రెండు అధ్యాపకుల పోస్టులను వెంటనే భర్తీ చేసేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం కళాశాల యాజమాన్యం సమకూర్చిన పాఠ్య పుస్తకాలను ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు అందజేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్జేడీ శారదకు అభివృద్ధి కమిటీ సభ్యులు అందజేశారు. కమిటీ ప్రతినిధులు గారపాటి త్రిమూర్తులు, గుణ్ణం వీర్రాజు, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో సదుపాయాలు


హెచ్‌ఎం సరస్వతికి రూ.50 వేల చెక్కు అందిస్తున్న ఉపాధ్యాయురాలు నాగమణి

రాజోలు: దాతల సహకారంతో పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని ఎంఈఓ నల్లి మనోహరం అన్నారు. బుధవారం రాజోలు బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు మొగలికుదురు నాగమణి ఉద్యోగ విరమణను పురస్కరించుకుని పాఠశాలకు రూ.50 వేల చెక్కును ఆమె అందజేశారు. హెచ్‌ఎం సరస్వతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రిటైర్డ్ ఆర్ఎంఓ సీహెచ్ పుష్కరరావు, నాగమణి దంపతులను ఉపాధ్యాయులు సత్కరించారు. ఎంఈఓ-2 ప్రసాదరావు, రిటైర్డ్ ఎంఈఓ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

అప్పనపల్లిలో దర్శనాలు పునరుద్ధరణ


విశేష అలంకరణలో అప్పనపల్లి బాలాజీ స్వామివారు

మామిడికుదురు: గోదావరి వరదల కారణంగా ఏడు రోజుల నుంచి నిలిపివేసిన అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామివారి దర్శనాలను బుధవారం నుంచి పునరుద్ధరించారు. ఆలయ అర్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులను దర్శనాలకు అనుమతించారు. వరద ఉధృతి కారణంగా ఆలయానికి వచ్చే భక్తులు ఇబ్బందులకు గురి కాకూడదన్న కారణంతో 24వ తేదీ బుధవారం నుంచి దర్శనాలను నిలిపివేశారు. ఆలయానికి వచ్చే ప్రధాన మార్గమైన అప్పనపల్లి కాజ్‌వే ముంపు బారిన పడడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. వరద ఉధృతి తగ్గుముఖం పట్టడంతో దర్శనాలను పునరుద్ధరించారు. ఆలయంలో దర్శనాలు, నిత్య కైంకర్యాలు యథావిధిగా జరుగుతాయని ఆలయ కార్యనిర్వహణాధికారి గ్రంధి మాధవి తెలిపారు.

శాకంబరిగా రావులమ్మ


రావులమ్మ తల్లికి కూరగాయలతో అలంకరణ

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారం గ్రామంలోని రావులమ్మ ఆలయంలో అమ్మవారు బుధవారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజాము నుంచి అమ్మవారికి వివిధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. వేద పండితులు మండ లక్ష్మీనరసింహమూర్తి ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమ పూజలు జరిపారు. అనంతరం మహిళలు 108 నదీ జలాల కలశాలతో ఊరేగింపుగా అమ్మవారిని ఆలయానికి తీసుకువచ్చి అభిషేకం చేశారు. గ్రామస్తులు సమకూర్చిన వివిధ రకాల స్వీట్లు, పండ్లు సమర్పించారు. ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని అమ్మవారికి ఆషాఢ మాస సారెను సమర్పించామని మహిళలు తెలిపారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన నిర్వహించారు.

అంతర్వేదిలో సమగ్రశిక్షా స్టేట్ ఫైనాన్స్ కంట్రోలర్


అంతర్వేది ఆలయంలో సమగ్ర శిక్షా ఫైనాన్స్ కంట్రోలర్ పల్లేశ్వరరావు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో స్వామివారికి బుధవారం సమగ్ర శిక్షా స్టేట్ ఫైనాన్స్ కంట్రోలర్ (విజయవాడ) కె.పల్లేశ్వరరావు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస్ కిరణ్, స్థానాచార్య వింజమూరి రామ రంగాచార్యులు స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు ఆయనకు ఆశీర్వచనాలు పలికారు. ఆయన వెంట కోనసీమ జిల్లా ఫైనాన్స్, అక్కౌంటెంట్ ఆఫీసర్ జి.ప్రవీణ్‌కుమార్, ఎంఈఓ-2 మద్దాలి వెంకటేశ్వరరావు ఉన్నారు.

ఘనంగా వేద పండిత సత్కార సభ


వేద పండిత సభలో మాట్లాడుతున్న వెంకట రామచంద్ర సోమయాజీ

రాజోలు: రాజోలు తాలూకా వేదశాస్త్ర పరిషత్ పండిత సత్కార సభ బుధవారం ఘనంగా జరిగింది. స్థానిక శివాలయ ప్రాంగణంలోని మహాన్యాస మండపంలో పురోహితుడు కడియాల సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన సభలో భీమవరం మావుళ్లమ్మ తల్లి ఆలయ వేద పండితుడు యావని వెంకట రామచంద్ర సోమయాజీ ముఖ్య అతిథిగా పాల్గొని 'వైదిక ధర్మం లోక హితం' అనే అంశంపై ప్రవచించారు. 27వ రాజోలు తాలూకా స్మార్త, ఆగమ, అపర పండితులను ఘనంగా సత్కరించారు. వైష్ణవాగమన గురించి అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయ ప్రధానార్చకుడు పాణింగిపల్లి శ్రీనివాసకిరణ్, అంతర్వేది నీలకంఠేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు అయలూరి నాగ వెంకట చంద్రసూర్యకుమార్ శైవాగమం గురించి, ఆకొండి ఫణిశాస్త్రి అపరం గురించి వివరించారు. ప్రధాన కార్యదర్శి మంగళంపల్లి సోమేశ్వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.